# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మంగళవారం 16 జూలై 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 354





కాశీ ఆలయంలో క్యూఆర్ కోడ్ అమలు


PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





## ఉప్పొంగుతున్న హుస్సేన్‌సాగర్

ఒక్కరోజు వర్షానికే నిండుకుండలా సాగరం మరో ఐదు రోజులపాటు భారీ వర్ష హెచ్చరిక




## కాంగ్రెస్‌ను తిడుతూ పోతే ఎలా?

# స్థానిక ఎన్నికలపై సీఎం దృష్టి



**కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఆగిపోకుండా రాష్ట్రంలో స్థానిక సంస్థలకు త్వరగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుదల కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు.ఇతర రాష్ట్రాల విధానాలపై అధ్యయనం సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు**

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఆగిపోకుండా రాష్ట్రంలో స్థానిక సంస్థలకు త్వరగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుదల కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. స్థానిక ఎన్నికలపై సోమవారం సచివాలయంలో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖ, మాజీ మంత్రి జానారెడ్డి, సీఎం సలహాదారు నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, సీఎస్ శాంతికుమారి, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, పంచాయతీరాజ్ కార్యదర్శి లోకేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణ, రిజర్వేషన్ల పెంపుపై చర్చించారు. ఇప్పటికే కులగణన నిర్వహణకు ఆమోదం తెలిపినందున.. దాని ఆధారంగా ఎన్నికలు జరిపేందుకు ఎంత సమయం పడుతుందని రేవంత్ అధికారులను ప్రశ్నించారు. 2011లో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన జనగణన ఫార్మాట్ 53 కాలమ్స్‌తో ఉందని.. దానికి మరో మూడు కాలమ్స్ జోడించి కులగణన చేపడితే కనీసం ఐదున్నర నెలల సమయం పడుతుందని అధికారులు వివరించారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణలో జరిగిన పంచాయతీ ఎన్నికల వరకు అనుసరించిన విధానాలు, వివిధ రాష్ట్రాల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో దాఖలైన కేసులు, వాటి తీర్పులు, పర్యవసానాలను మాజీ మంత్రి జానారెడ్డి వివరించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలుకు ఇప్పటివరకు అనుసరించిన విధానాలపై కాలక్రమ పట్టిక రూపొందించాలని, ఏవైనా సందేహాలుంటే జానారెడ్డితోపాటు పంచాయతీరాజ్‌శాఖ నిపుణులు, మాజీ ఉన్నతాధికారుల సలహాలు తీసుకోవాలని, చట్టపరమైన విషయాల్లో అడ్వొకేట్ జనరల్‌తో చర్చించాలని సీఎం సూచించారు.

మిగతా రాష్ట్రాలు రిజర్వేషన్ల విషయంలో అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. త్వరగా ఆయా అంశాలపై నివేదిక రూపొందిస్తే శాసనసభ సమావేశాలకు ముందే మరోసారి భేటీ అయి ఈ అంశంపై

తుది నిర్ణయం తీసుకుందామని తెలిపారు. టీజీఐఐసీ ఛైర్మన్‌గా తనను నియమించినందుకు నిర్మలా జగ్గారెడ్డి.. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణాకు భారీ వర్ష సూచన



హైదరాబాద్ :మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రధానంగా పశ్చిమ, నైరుతి దిశల నుండి ఎక్కువ స్థాయిలో గాలులు వీచే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కొత్తగూడెం, ఖమ్మం, సూర్యపేట, మహబూబాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా.. మిగిలిన జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. బలమైన నైరుతి రుతుపవనాలకు తోడు.. సముద్ర మట్టానికి 3.1కి.మీ. నుంచి 7.6 కి.మీ. మధ్యలో ఆవర్తనం కొనసాగుతుందని వాతావరణశాఖ చెప్పింది. రాష్ట్రంలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.

## తెలంగాణలోనూ ఇక బస్సు ఛార్జీల పెంపు తప్పదు

### కర్నాటక తరహాలో అంటూ కెటిఆర్ విమర్శలు



**హైదరాబాద్:** కర్ణాటకలో ఆర్టీసీ బస్సు ఛార్జీల పెంపు ప్రతిపాదనపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. బస్సు ఛార్జీల పెంపుపై కర్ణాటకను తెలంగాణ అనుసరించే రోజు ఎంతో దూరంలో లేదని పేర్కొన్నారు. ఎక్స్(ట్విటర్) వేదికగా ఆయన పోస్ట్ చేశారు. ఏదైనా ఉచితంగా ఇస్తామంటున్నారంటే మరో ఆలోచనతో తీసుకెళ్తున్నట్లేనని తెలిపారు. ఉచితంగా ఇస్తామన్నారంటే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కర్ణాటకలో బస్సు టికెట్ ఛార్జీల్ని పెంచేందుకు కేఎస్ఆర్టీసీ కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ బస్సుల్లో ఛార్జీల పెంపు అనివార్యమని కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా కార్పొరేషన్ ఛైర్మన్ ఎస్ఆర్ శ్రీనివాస్ ఇటీవల తెలిపారు.

15 నుంచి 20శాతం మేర ఛార్జీల పెంపునకు సంబంధించిన ప్రతిపాదనల్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్లు ఆయన చెప్పారు. 'ఇంధనం, ఆటో విడిభాగాల ధరలు గణనీయంగా పెరిగాయి. 2019 నుంచి బస్సుల్లో టికెట్ ఛార్జీల్ని పెంచలేదు.

2020 నుంచి కేఎస్ఆర్టీసీ ఉద్యోగుల వేతన సవరణ జరగలేదు. అందువల్ల టికెట్ ధరలను పెంచడం తప్పడం లేదు. గత మూడు నెలల్లో కార్పొరేషన్‌కు రూ.295 కోట్ల నష్టం వాటిల్లింది. 40 కొత్త ఓల్వో బస్సుల్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించాం. ఇప్పటివరకు 600 సాధారణ బస్సుల్ని కొనుగోలు చేశాం' అని తెలిపారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



## యాదాద్రిలో గరి ప్రదక్షిణం

### భారీగా హాజరైన భక్తులు

**యాదగరిగుట్ట:** యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. తొలుత వైకుంఠ ద్వారం వద్ద స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పూజలు చేసి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఆలయ ఈవో భాస్కరరావు, ధర్మకర్త నరసింహమూర్తి, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్త బృందాలు పాల్గొన్నాయి. మరోవైపు యాదాద్రి క్షేత్రం గర్భాలయంలోని మూలవరులకు సోమవారం ఉదయం అష్టోత్తర శత ఘటాభిషేకం నిర్వహించారు. ఈ విశేష క్రతువును వేదమంత్రోచ్ఛరణల మధ్య చేపట్టారు.

# తెల్ల రేషన్‌కార్డే ప్రామాణికం





హైదరాబాద్:రాష్ట్రంలో పంట రుణాల మాఫీకి ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. పథకం అమలు విధి విధానాలను వివరిస్తూ సోమవారం ఉత్తర్వులు (జీవో ఆర్టీ నంబరు 567) జారీ చేసింది. ఒక రైతు కుటుంబానికి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేయనుంది. రైతు కుటుంబం గుర్తింపునకు తెల్లరేషన్ కార్డు(ఆహారభద్రత కార్డు)ను ప్రామాణికంగా తీసుకోనున్నట్లు ప్రకటించింది. అన్ని షెడ్యూల్డు, వాణిజ్య, ప్రాంతీయ గ్రామీణ, జిల్లా సహకార బ్యాంకుల నుంచి 2018 డిసెంబరు 12 నుంచి మంజూరైన, రెన్యువలైన రుణాలకు, 2023 డిసెంబరు 9 వరకు బకాయి ఉన్న పంట రుణాలకు, స్వల్పకాలిక రుణాలకు ఇది వర్తిస్తుందని... రుణాల అసలు, దానికి వర్తించే వడ్డీని కలిపి రూ.2 లక్షలు మాఫీ అవుతాయని ప్రభుత్వం తెలిపింది. రుణమాఫీ సొమ్ము నగదు బదిలీ ద్వారా లబ్ధిదారుల రుణ ఖాతాలకు జమవుతుందని వెల్లడించింది. ఆరోహణ క్రమంలో మొదట చిన్న మొత్తాలు, తర్వాత పెద్ద మొత్తాల రుణాలను మాఫీ చేస్తామని వివరించింది. పునర్ వ్యవస్థీకరించిన (రీషెడ్యూలు) రుణాలకు, ఎస్‌హెచ్‌జీ (స్వయం సహాయ గ్రూపులు), జేఎల్‌జీ (ఉమ్మడి రుణ గ్రూపులు), ఆర్ఎంజీ (రైతు మిత్ర గ్రూపులు), ఎల్ఈసీఎస్ (కౌలుదారులు) రుణాలకు ఈ మాఫీ వర్తించదని స్పష్టం చేసింది. రుణమాఫీ అమలు కోసం ప్రత్యేక వెబ్‌పోర్టల్ ఏర్పాటు చేస్తామని, రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే ప్రత్యేక విభాగం ద్వారా 30 రోజుల్లోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. ఎవరైనా మోసపూరితంగా రుణమాఫీని పొందితే వారి నుంచి డబ్బులను తిరిగి తీసుకుంటామని స్పష్టంచేసింది.

వ్యవసాయాభివృద్ధి, రైతుల సంక్షేమం కోసమే

శాసనసభ ఎన్నికల్లో రూ.2 లక్షల మేరకు పంట రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం దానికి అనుగుణంగా కసరత్తు చేసి, తాజాగా ఈ మార్గదర్శకాలను విడుదల చేసింది. వ్యవసాయాభివృద్ధికి, రైతుల ఆర్థిక పరిస్థితిని, సంక్షేమాన్ని మెరుగుపరిచేందుకు రుణమాఫీని ఒక అత్యవసర పెట్టుబడిగా గుర్తించామని, రాష్ట్రంలో వ్యవసాయ కార్యకలాపాలు స్థిరంగా ఉండేలా చూడడానికి రుణమాఫీ–2024 పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. రుణమాఫీ ద్వారా అత్యవసర వ్యవసాయ ఇన్‌పుట్‌ల కొనుగోలుకు అవకాశం లభిస్తుందని, రుణగ్రస్తత నుంచి అన్నదాతలను ఈ పథకం కాపాడుతుందని ఆశాభావం వ్యక్తంచేసింది. రూ.2 లక్షలకంటే అధికంగా ఉంటే ముందే చెల్లించాలిరుణమాఫీ అమలు కోసం వ్యవసాయ శాఖ సంచాలకులు, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) సంయుక్తంగా ఒక వెబ్‌పోర్టల్‌ను నిర్వహిస్తాయి. అందులో ప్రతి రైతు కుటుంబానికి చెందిన రుణఖాతాల వివరాలు, అర్హత మొత్తాన్ని నిర్ణయించడానికి సౌకర్యం ఉంటుంది.



# భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాల్సిందే

**ప్రభుత్వాలు కూలుస్తామంటే ఊరుకోవాలా? బండి సంజయ్, కెటిఆర్ ల తీరుపై మండిపడ్డ పొన్నం**

**కరీంనగర్:** భవిష్యత్తు తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే మొక్కలు నాటాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాల్లో 43 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ అలవాటు అందరి జీవితంలో భాగం కావాలని కోరారు..ప్రభుత్వం మొక్కలు పంపిణీ చేస్తోంది. ఎన్ని చేసినా ప్రజల సహకారం కావాలి. కాలుష్యం తగ్గి వ్యాధులు దరి చేరకుండా ఉండాలంటే అందరూ దీనిపై దృష్టి సారించాలి. ప్రతి మొక్కకూ జియో ట్యాగింగ్ చేయాలి. ఇది ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజల కార్యక్రమంగా, సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. భాజపా ఇప్పటివరకు ఎన్నో ప్రభుత్వాలను కూల్చింది. ప్రభుత్వాన్ని కూల్చుతామంటే చూస్తూ ఊరుకోవాలా? డిసెంబర్ 3 వరకు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకునే ఆలోచనే లేదు. ప్రభుత్వాన్ని కూల్చుతామని మీరంటుంటే.. నిలబెట్టడానికి వారు వస్తున్నారు. మేం ధర్మం తప్పలేదు.. ప్రభుత్వ సుస్థిరత కోసమే చేరికలు. కులగణనపై మరో రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటాం' అని పొన్నం ప్రభాకర్ తెలిపారు. బండి సంజయ్, కేటీఆర్ తీరు దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టే ఉందన్నారు. బీజేపీలో చేరాలంటే రాజీనామా చేసి పార్టీలో చేరాలన్న బండి సంజయ్ కు కౌంటర్ ఇచ్చారు పొన్నం. బీజేపీ కూల్చిన ప్రభుత్వాల్లో ఎంత మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేశారని ప్రశ్నించారు. తమ ప్రభుత్వాన్ని కూల్చుతామంటే..చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు మంత్రి పొన్నం. తాము ధర్మం తప్పలేదని.. కుల గణనపై రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు. డిసెంబర్ 3 వరకు ఎమ్మెల్యేలను చేర్చుకోవాలన్న ఆలోచన తమకు లేదన్నారు. ప్రభుత్వాన్ని కూల్చుతామని బీఆర్ఎస్ అంటుంటే....నిలబెట్టడానికి ఎమ్మెల్యేలు వస్తున్నారని చెప్పారు.

ప్రభుత్వ సుస్థిరత కోసమే చేరికలని అన్నారు. ఇప్పటి వరకు బీఆర్ఎస్ కు చెందిన 9 మంది ఎమ్మెల్యేలు, ఆరుగుగు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ లో చేరిన సంగతి తెలిసింది.





# రుణమాఫీపై మభ్యపెట్టే ప్రయత్నాలు



**హైదరాబాద్:** రుణమాఫీకి పీఎం కిసాన్ డేటాను అనుసరించడం అంటే రుణమాఫీ లక్ష్యానికి గండికొట్టడం.. రైతాంగాన్ని వంచించడమేనని మాజీ వ్యవసాయశ్శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. హామీలు ఇచ్చినప్పుడు లేని ఆంక్షలు .. అమలు చేసేటప్పుడు ఎందుకని ప్రశ్నించారు. ఈ ఆంక్షలు విధించడానికి ఈ ఏడు నెలల సమయం ఎందుకు తీసుకున్నట్లని అన్నారు. పంటల రుణమాఫీకి సంబంధించి రాష్ట్ర వ్యవసాయ శాఖ జారీ చేసిన మార్గదర్శకాలపై మాజీ మంత్రి ఫైర్ అయ్యారు. అవి మార్గదర్శకాలు కావు.. మభ్య పెట్టేందుకు ప్రయత్నాలు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ మార్గదర్శకాలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుంది అని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎంతో మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. ఉమ్మడి రాష్ట్రంలో పడిన రైతుల రుణభారాన్ని తొలగించడం కోసం వ్యవసాయ సుస్థిరత కోసం కేసీఆర్ 2 విడుతల రుణమాఫీ పక్రియకు శ్రీకారం చుట్టారు. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ పథకాలకు కేసీఆర్ సర్కార్ శ్రీకారం చుట్టింది. మొదటి విడుతలో 35.31 లక్షల మంది రైతులకు రూ. 16,144.10 కోట్లు రుణమాఫీ చేశారు. రెండో విడుతలో 22 లక్షల 98 వేల 39 రైతులకు రూ. 13,000.51 కోట్లు రుణమాఫీ చేశారు. ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం అసలు రైతులకు రుణాలే మాఫీ చేయనట్లు కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేసింది.

# సచివాలయ ముట్టడికి యత్నించిన బిసి జనసభ

**హైదరాబాద్:** తెలంగాణ సెక్రటేరియట్ వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయడం సహా, బీసీ కులగణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు వంటి ప్రధాన డిమాండ్లతో బీసీ జనసభ నాయకులు, నిరుద్యోగులు సచివాలయం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సచివాలయంలోకి వెళ్లేందుకు యత్నించగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తోపులాట చోటు చేసుకుంది. పోలీసులతో వారు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ సహా ఆందోళన కారులను అరెస్ట్ చేసి డీసీఎం వాహనంలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిరుద్యోగుల సెక్రటేరియట్ ముట్టడి పిలుపులో భాగంగా బీసీ జనసభ కార్యకర్తలు సచివాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నిం చారు. ఈ క్రమంలో నిరుద్యోగులు, జనసభ కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట చోటుచేసుకున్నది. సెక్రటేరియట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన బీసీ జనసభ కార్యకర్తలను పోలీసులు పట్టుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలతో హోరెత్తింది. జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ సహా కార్యకర్తలను అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో డీఎస్సీని వాయిదా వేయాలని రాజారాం యాదవ్ డిమాండ్ చేశారు. డీఎస్సీని వాయిదావేయకపోతే సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కాగా, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఏటా రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ విడుదల, మెగా డీఎస్సీ నోటిఫికేషన్, గ్రూప్ 2, 3 పోస్టుల పెంపు, డీఎస్సీ పరీక్షల వాయిదా, గ్రూప్–1 మెయిన్‌కు 1:100 పద్ధతిలో అభ్యర్థులను పిలవాలనే డిమాండ్లతో నిరుద్యోగులు, ఉద్యోగార్థులు రాష్ట్ర సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో



సెక్రటేరియట్ పోలీసుల వలయంలోకి వెళ్లింది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలిరానున్న నేపథ్యంలో సచివాలయం వద్ద భారీగా పోలీసులును మోహరించారు. బాహుబలి బారికేడ్లు, ఇనుపకంచెలు, వాటర్ క్యానన్లను ఏర్పాటు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి సచివాలయ ముట్టడికి తరలివస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేసారు. ఇదిలావుంటే నిరుద్యోగ యువకులు తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం దుర్మార్గ పూరితంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. వారి సమస్యలను సానుకూల ధృక్పథంతో నెరవేర్చాల్సింది పోయి నిర్బంధం పెడతూ అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల డిమాండ్ల కోసం సెక్రటేరియేట్ ముట్టడికి ప్రయత్నించిన రాజారాం యాదవ్ సహా ఇతర విద్యార్థి నాయకులను అరెస్ట్ చేయటాన్ని కేటీఆర్ ఖండించారు. రాజారాం యాదవ్ పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తామని నమ్మబలికిన సర్కార్ ఇప్పుడు వారిని గాలికి వదిలేసిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకురావటం, శాంతియుతంగా ఆందోళన చేయటం కూడా ఈ ప్రజాపాలన నిషేధమా అని కేటీఆర్ ప్రశ్నించారు. గత కొన్ని రోజులుగా విద్యార్థులు, నిరుద్యోగుల పట్ల ఈ ప్రభుత్వం అణిచివేత ధోరణిని సాగిస్తుందని ఇది ఎంత మాత్రం మంచిది కాదని హెచ్చరించారు. పోలీసులు అరెస్ట్ చేసిన రాజారాం యాదవ్ సహా మిగతా విద్యార్థి నాయకులందరినీ బేషరతుగా వెంటనే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ వారిని ఇప్పుడు పట్టించుకోవటం మానేసిందని కేటీఆర్ అన్నారు. ఇప్పుడు విద్యార్థులు, నిరుద్యోగులు చేస్తున్న డిమాండ్లను పరిష్కరించకుంటే ఏ నిరుద్యోగులను రెచ్చగొట్టి గ్దదెనెక్కారో ఇప్పుడు వాళ్లే ఈ ప్రభుత్వం పతనానికి కారణమవుతారన్నారు.

నిరుద్యోగ డిమాండ్లను పరిశీలించకుండా ప్రభుత్వం ఇలాగే మొండి వైఖరి అవలంభిస్తే తప్పకుండా బీఆర్ఎస్ తరపున పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

# బిజెపి,బిఆర్ఎస్ రహస్య ఒప్పందం

**హైదరాబాద్:** తెలంగాణలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రహస్య ఒప్పందాలకు నెమ్మదిగా తెర దించుతున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. ఢిల్లీలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు బీజేపీతో సంప్రదింపులు జరిపారని అన్నారు. కవిత బెయిల్ కోసమే బీజేపీకి బీఆర్ఎస్ నేతలు స్నేహ హస్తం అందిస్తున్నారని చెప్పారు. హరీష్ రావు ప్రజా నేత అని బీజేపీ కేంద్ర మంత్రి బండి సంజయ్ డబ్బాలు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. నిన్నటి దాకా హరీష్ రావుపైన దుమ్మెత్తిపోసిన బీజేపీ నేతలు ఇప్పుడు పొగుడుతున్నారని అన్నారు. హరీష్ రావును పొగడ్తలతో ముంచెత్తడం వెనుక ఆయనతో రాజీనామా చేయించి బీజేపీ తరపున పోటీ చేయించే ఆలోచన ఉన్నట్లు కనిపిస్తోందని అన్నారు. అందుకే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసినా సిద్దిపేటలో హరీష్ రావు మళ్లీ గెలుస్తాడని బండి సంజయ్ అంటున్నారని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ పైన ఒత్తిడి తెచ్చి బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. విలీనానికి కేసీఆర్ ఒప్పుకోక

పోతే హరీష్ రావు ను అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్‌ను చీల్చే అవకాశాలున్నాయని చెప్పారు. మహారాష్ట్రలో ఏక్ నాథ్ షిండే ప్రయోగాన్ని తెలంగాణలో బీఆర్ఎస్ పైన బీజేపీ చేస్తుందనే అనుమానాలున్నాయని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను దెబ్బతీయడం కోసమే రెండు పార్టీలు ముసుగు తీసి వస్తున్నాయని విమర్శించారు. బండి సంజయ్, హరీష్ రావు ప్రజా నేత అని చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సమర్థిస్తారా..? అని ప్రశ్నించారు. మెదక్‌లో బీజేపీ గెలుపు కోసం లోపాయికారీ ఒప్పందం జరిగినట్లు బండి సంజయ్ వ్యాఖ్యలు చూస్తుంటే అర్థమవుతుందని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటైనా తెలంగాణలో కాంగ్రెస్‌కు ఇబ్బంది లేదని ఆది శ్రీనివాస్ తెలిపారు.

# మచ్చుమర్రి బాలిక కుటుంబానికి పదిలక్షల పరిహారం

## దోషులను వదిలేది లేదన్న హోంమంత్రి అనిత

**అమరావతి:** మచ్చుమర్రి అత్యాచార నిందితులను వదిలే ప్రసక్తే లేదని, కఠినంగా శిక్షిస్తామని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ముచ్చుమర్రి కేసులో బాధిత బాలిక కుటుంబానికి రూ.10లక్షలు పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. మరోచోట అత్యాచారానికి గురైన బాలిక పేరుతో రూ.5లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని వెల్లడించారు. ఆడపిల్లతో అసభ్యంగా ప్రవర్తించిన వారికి అదే చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. అమరావతిలో ఆమె మీడియాతో మాట్లాడారు. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్లాల గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై మైనర్ బాలురు అత్యాచారం చేశారు. 14 నుంచి 16 ఏళ్లలోపు వయసున్న ముగ్గురు.. ఆ చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి ఇంట్లో చెబుతుందన్న భయంతో హత్య చేసినట్లు సమాచారం. బాలిక ఆచూకీ కోసం పోలీసులు చేపట్టిన గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# కాంగ్రెస్‌ను తిడుతూ పోతే ఎలా?

**హైదరాబాద్:**కాంగ్రెస్ ముక్త భారత్ అంటూ మోడీ ఇచ్చిన నినాదం బెడిసి కొట్టింది. ఏదో ఒక పార్టీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తూ పాలన సాగించడం ఉత్తమ నాయకుడి లక్షణం కాదు. కాంగ్రెస్‌ను గత పదేళ్లుగా తిట్టి పోస్తూనే ఉన్నారు. ఆ తిట్లే వారికి వరంగా మారాయి. అందుకే మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ సంఖ్య వందకు చేరింది. ప్రతిపక్ష హోదా కూడా లేని స్థాయి నుంచి ప్రతిపక్ష హోదాకు వచ్చారు. అలాగే ఇటీవలి ఉప ఎన్నికల్లో కూడా ఇండియా కూటిమి అత్యధిక స్థానాల్లో విజయం సాధించింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ముందుకేసుకుని వాటిని పరిష్కరించకుండా పరజలను మభ్యపెట్టడం వల్ల మోడీ బలహీనం అయ్యారు. అయినా మార్పు కానరావడం లేదు. ఎమర్జెన్సీని రాజ్యాంగ హత్యా దివస్‌గా ప్రకటించడం కక్షసాధింపు రాజకీయాలకు పరాకాష్ట. ఈ కాలం ప్రజలకు ఇందిర పాలన గురించి పెద్దగా తెలియదు. తెలుసుకునే ఓపిక కూడా లేదు. మోడీ ఏం చేస్తున్నారన్నదే గత పదేళ్లుగా పరిశీలిస్తున్నారు. దేశంలో ప్రధానంగ నిరుద్యోగ సమస్యల విపరీతంగా ఉంది. చదువులు మోయలేని భారంగా మారాయి. ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మధ్య తరగతి ప్రజలకు జిఎస్టీ వాతలు తట్టుకోలుకుండా ఉన్నాయి. ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మడం వల్ల మరింత నిరుద్యోగం పెరుగుతుందన్న ఆందోళన కలుగుతోంది. అగ్నివీర్ పథకంతో నాలుగేళ్లకే ఆర్మీ ఉద్యోగాలు పోతున్నాయి. ఇవన్నీ ప్రధాన సమస్యలు. వీటి గురించి ఎక్కడా మాట్లాడడం లేదు. రాజకీయాలు అదేపనిగా చేయరాదు. ఎన్నికల సమయంలో మాత్రమే వాటిని ఉపయోగించాలి. ఇంకా ఇందిర విధించిన ఎమర్జెన్సీ గురించి చర్చిస్తూ..అసలు సమస్యలను పక్కదారి పట్టిస్తే..ప్రజలు కూఆ మోడీని పక్కదారి పట్టించడం ఎలా అన్నది ఆలోచిస్తారు. పెరుగుతున్న జనాభాను తగ్గించడం, ధరలను తగ్గించడం, జిఎస్టీని తగ్గించడం, ఉద్యోగాలు పెంచడం లక్ష్యంగా పనిచేయకుంటే భారత్ మరింత అథఃపాతాళానికి విసిరివేయబడడం ఖాయం. ఈ సమస్యలపై రానున్న పార్లమెంట్ సమావేశాల్లో చర్చించాలి. పరిష్కారాలు కనుగొనాలి. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత ఈ పదేళ్లలో ఇచ్చిన హామీలను అమలు చేసే సంకల్పం లోపించింది. అయితే అవినీతి మరక



అంటకుండా దేశాన్ని పాలించామని చెప్పుకుంటున్నా..కార్పోరేట్ కంపెనీలకు దోచిపెడుతున్న తీరుపై సర్వత్రా విమర్శలు ఉన్నాయి. అయితే కాంగ్రెస్ తరహా రాజకీయాలకు పెద్ద ఎత్తున తెరతీసారు. తనవైపు వేలెత్తి చూపే అవకాశం లేకుండా తొలినాళ్లలో పాలన సాగించిన మోదీ ఇప్పుడు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. తన వ్యక్తిగత ప్రతిష్టను పెంచుకునేలా చేసుకుంటున్న తీరు సరికాదు. పాలనలో మాత్రం అంతగా దూసుకుని పోవడం లేదు. ప్రధానంగా నోట్లరద్దు, జిఎస్టీతో ప్రజలకున్న ఆశలు అడియాశల య్యాయి. తాజాగా 2వేల నోట్ల రద్దు కూడా ఇదే కోవలోకి వస్తుంది. ప్రధానంగా ధరల పెరగుదల విషయంలో పట్టింపు లేకుండా పోయాయి. ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతున్నా వాటికి ధరలు దక్కడం లేదు. రైతులు ఆందోళ చేస్తున్నా వ్యవసాయాన్ని బలోపేతం చేసే చర్యలు కానరావడం లేదు. గోదాముల్లో ధాన్యం మగ్గుతున్నా బయటకు రావడం లేదు. అలాగే దిగుమతులు కూడా తగ్గడం లేదు. కాంగ్రెస్ తరహా రాజకీయాలు చేస్తున్నారే తప్ప ఆదర్శ రాజకీయాలకు పెట్టింది పేరయిన బిజెపి ఇప్పుడా ముసుగు నుంచి బయటపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్ఠ మసకబారినా, ప్రధానంగా బిజెపికి రాజకీయాలకు చెరగని మచ్చని తెచ్చి పెట్టాయి. పాలన ఎలా ఉన్నా అవినీతి రహితంగా సాగుతుందన్న పేరు ప్రచారం చేసుకోవడం మినహా ఇతర విషయాలను పెద్దగా పట్టించుకోవడం లేదు. అవినీతి లేకున్నా అక్రమ రాజకీయాలు సాగుతూనే ఉన్నాయి. అమిత్‌షా, మోడీ ద్వయం రాష్ట్రాల్లో చిచ్చు పెట్టి సఫలం అయ్యారు. కాంగ్రెస్ విముక్త భారత్ లక్ష్యంగా

చేస్తున్న రాజకీయాలు ఒక్కోసారి వెగటుగా ఉంటాయనడానికి ఇటీవలి పరిణామాలు ఉదాహరణగా చెప్పుకోవాలి. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసే క్రమంలో చేస్తున్న పనులన్నీ దేశహితం కోసమేనని సరిపెట్టు కోలేం. అలాగే గతంలో మీరు చేయలేదా అని ఎదురుదాడి చేయడం ఇటీవల అలవాటయ్యింది. మిగతా నాయకులకు, మిగతా పార్టీలకు, భారతీయ జనతా పార్టీకి చెందిన మోదీ, షాలకు కూడా తేడా లేదని ప్రజలు గుర్తించారు. ఈ క్రమంలోనే తప్పటడుగులు వేస్తున్నారు.

# కాశీ ఆలయంలో క్యూఆర్ కోడ్ అమలు ప్రవేశానికి అధికారులు ఏర్పాట్లు

వారణాసి: ప్రఖ్యాత కాశీ విశ్వనాథ ఆలయాన్ని దర్శించే యాత్రికులకు మరింత సులభంగా ఆలయ ప్రవేశానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా క్యూఆర్ కోడ్ ఆధారిత గుర్తింపు కార్డుతో ఆలయం ఆవరణలోకి ప్రవేశం కల్పించనున్నారు. వీఐపీ దర్శనం, ప్రొటోకాల్ దర్శనం కోసం వచ్చేవారికే ఈ పద్ధతిలో ఎంట్రీ కల్పించనున్నారు. గత మార్చి నుంచి అధికారులు, ఉద్యోగులకు మాత్రమే ఈ వెసులుబాటు కల్పించగా ఇప్పుడు సాధారణ యాత్రికులకు కూడా ఈ అవకాశాన్ని విస్తరిస్తున్నారు. సౌకర్యాలను మెరుగుపరచడంలో భాగంగా పూర్తి స్థాయి డిజిటల్ సర్వీసులను అందించేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నాయి. క్యూఆర్ కోడ్ ఆధారిత ఆర్ఎఫ్ఐడీ (రేడియా ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్) ద్వారా యాత్రికుల ప్రవేశానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఆర్ఎఫ్ఐడీ మెషీన్‌ను ఆలయం వద్ద ఇప్పటికే ఏర్పాటు చేశారు. శ్రీ కాశీ విశ్వనాథుని లోగోతో ఉండే ఈ ఐడెంటిఫికేషన్ కార్డును ఆలయ యంత్రాగం జారీ చేస్తుంది. యాత్రికులు ఐడీ కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కానింగ్ చేసుకుని ధామ్‌లోకి ప్రవేసించవచ్చు. కార్డు స్కాన్ కాగానే ప్రవేశద్వారాలు ఆటోమాటిక్‌గా తెరుచుకుంటాయి. ఈ పక్రియ ప్రారంభం కాగానే ఆలయాన్ని దర్శించే ప్రతి ఒక్కరి రికార్డులను భద్రం చేసే పని ఆలయ అధికారులు తేలికవుతుంది. ఆర్ఎఫ్ఐడీ మెషీన్లను ప్రవేశద్వారం, ఎగ్జిట్ పాయింట్ల వద్ద ఏర్పాటు చేస్తుండగా, ఈ మెషీన్లు క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసి భక్తుల రాకపోకలకు వీలుకల్పిస్తాయి. 15 మీటర్ల దూరం నుంచి మెషీన్లు ఆర్ఎఫ్ఐడీ కార్డ్‌ను రీడ్ చేస్తాయి. కార్డులో ఉద్యోగుల వ్యక్తిగత సమాచారం, యాత్రికుల పేరు, చిరునామా, మొబైల్ నెంబర్ ఉంటాయి.

# ఉప్పొంగుతున్న హుస్సేన్‌సాగర్

## ఒక్కరోజు వర్షానికే నిండుకుండలా సాగరం

## మరో ఐదు రోజులపాటు భారీ వర్ష హెచ్చరిక

**హైదరాబాద్:** ఆదివారం కురిసిన భారీ వర్షానికి హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ నిండుకుండలా మారింది. జలాశయంలోకి ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. హుస్సేన్‌సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 514 అడుగులు. ప్రస్తుతానికి నీటి మట్టం 513 అడుగులు దాటింది. ఎగువన కురుస్తున్న వర్షాలకు వరద నీరు మొత్తం హుస్సేన్‌సాగర్‌లో చేరుతోంది. కూకట్‌పల్లి, బంజార, బుల్కాపూర్ నాలాల నుంచి భారీగా వరద వస్తోంది. హుస్సేన్ సాగర్ 2 గేట్లు ఎత్తి వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నీటిమట్టం పెరిగితే ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై జీహెచ్ఎంసీ అధికారులు పరిశీలన చేశారు. మళ్లీ రానున్న 24 గంటల్లో వర్షాలు కురిసే నేపథ్యంలో ముంపునకు గురయ్యే కవాడిగూడ, మిగిలిన ప్రాంతాల ప్రజలనూ జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తం చేశారు. నైరుతి రుతుపవనాల కారణంగా ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో జోరు వానలు కురుస్తున్నాయి. నేటి నుంచి ఐదు రోజుల పాటు తెలుగురాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. నైరుతి రుతుపవనాలు బలపడటానికి తోడు.. అల్ప పీడన ప్రభావంతో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఈ



వర్షాలు ఈ రోజు నుంచి ఐదు రోజుల పాటు అంటే జులై 18 వరకు ఈ వర్షాలు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని కొన్ని జిల్లాలకు వర్ష సూచన చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో నైరుతి రుతుపవనాలకు తోడు ఆవర్తనం ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం చెప్పింది. ఏపీకి భారీ వర్షసూచన చేసింది వాతావరణశాఖ. రాష్ట్రంలో అల్లూరి సీతరామరాజు, ఎన్టీఆర్, కృష్ణ, ఏలూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ను అమరావతి వాతావరణ శాఖ జారీ చేసింది. ఇక ఏపీలో మిగిలిన జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. నేడు, రేపు కోస్తా జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉండగా.. అలాగే, రాయలసీమలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంటకు 30–40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. భారీ వర్షాల నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది. రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.


తెలంగాణాకు భారీ వర్ష సూచన

÷లంగాణలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రధానంగా పశ్చిమ, నైరుతి దిశల నుండి ఎక్కువ స్థాయిలో గాలులు వీచే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో

రాష్ట్రంలో కొత్తగూడెం, ఖమ్మం, సూర్యపేట, మహబూబాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా.. మిగిలిన జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. బలమైన నైరుతి రుతుపవనాలకు తోడు.. సముద్ర మట్టానికి 3.1కి.మీ. నుంచి

7.6 కి.మీ. మధ్యలో ఆవర్తనం కొనసాగుతుందని వాతావరణశాఖ చెప్పింది. రాష్ట్రంలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.

వేగుచుక్క
TELUGU DAILY NEWS
3 మంగళవారం 16 జూలై 2024



# ప్రజావాణికి 91 ఫిర్యాదులు.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జూలై 15**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 91 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరందు, డీఆర్డీఓ సాయగౌడ్, డీపీఓ చక్రవర్తుల తరుణ్, నిజామాబాద్ ఏ.సీ.పీ రాజా వెంకట్ రెడ్డి లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి.






**- సిరికొండ పిఎచ్ సి వైద్యాధికారి డాక్టర్ చిట్యాల అరవింద్.**

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, జులై 15:**

ప్రతి ఒక్కరు వ్యక్తిగత, వరిసరాల శుభ్రతను పాటిస్తూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిరికొండ మండల వైద్యాధికారి డాక్టర్ చిట్యాల అరవింద్ అన్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో 'సీజనల్ వ్యాధులు- నివారణ చర్యలు' అనే అంశంపైన సత్యశోధక్ పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ అరవింద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ అరవింద్ మాట్లాడుతూ, చికిత్సకంటే నివారణ ముఖ్యమని, వ్యక్తిగత, వరిసరాల పరిశుభ్రతలను విధిగా పాటిస్తూ వ్యాధుల పట్ల అవగాహనను కల్గి ఉంటే ఆరోగ్యకరమైన జీవితాలను పొందగలుగుతామన్నారు. పరిసర ప్రాంతాలలో నీటిని నిల్వ ఉండకుండా చూసుకోవాలని, లేదంటే నీటిలో దోమలు వృద్ధి చెందే ప్రమాదం ఉందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. నీటి ద్వారా వచ్చే వ్యాధులను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫంగల్ ఇన్ఫెక్షన్ల నివారణ కోసం కాచివడబోసిన నీటినే తాగాలన్నారు. దోమలు దరిచేరకుండా దోమ నిరోధకాలు, దోమ తెరలు వాడాలని తెలిపారు, దోమకాటు వలన మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, మెదడువాపు లాంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశం వున్నదని చిన్నపాటి జ్వరం వచ్చినా ఆసుప్రతికి వెళ్లి వెద్యులను సంప్రదించాలని కోరారు. సీజనల్ వ్యాదులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వరిసరాలలో మురికి నీటి నిల్వలు, వ్యర్థ పదార్థాల వంటివి లేకుండా ఎప్పడికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకొని దోమలు, ఈగలు క్రిమికీటకాల వంటివి నివారిస్తే అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టగలుతామన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రతి పౌరుడు వ్యక్తిగత ఆరోగ్యంపైన చైతన్యమై ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుటకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య, నోడల్ సూపర్ వైజర్ కె. రమేష్, వైద్య సిబ్బంది సబితా, మండొదరి పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి.

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**



**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జులై 15**

ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. వివిధ మండలాలల నుంచి వచ్చిన ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సోమవారం కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల ద్వారా స్వీకరించారు. ప్రధానంగా విద్య,వైద్య, బిసి,గిరిజన సంక్షేమం, విద్యుత్, పంచాయతీ, పింఛన్లు, ఆపద్బాందు, మున్సిపాలిటీ, ధరణి, మైన్స్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు తదితర అంశాలకు సంబంధించి 127 ఫిర్యాదులు అందాయి. అట్టి ఫిర్యాదులను ఆయా శాఖాధికారులకు అందజేస్తూ ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణి తో పాటు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ క్షుణ్ణంగా పరిశించి పరిష్కరింపదగినవి వెంటనే పరిశీలించాలని, లేని వాటికి తగు ప్రత్యామ్నాయ మార్గం ఫిర్యాదీదారునికి తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డిఆర్డిఓ చందర్, డిపిఓ శ్రీనివాసరావు, సిపిఓ రాజారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీతోనే ప్రజా సమస్యలు పరిష్కారం.

**పార్టీకి కార్యకర్తలే బలం.**

**ఎంపీ అరవింద్, ఎమ్మెల్యే దన్ పాల్.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జులై 15:**



బీజేపీ పాలనలోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని, పార్టీ కి కార్యకర్తలే బలం అని ఎంపీ అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ అన్నారు. భారతీయ జనతా పార్టీ నిజామాబాదు జిల్లా కార్యవర్గసమావేశం సోమవారం నగరంలోనీ శ్రావ్య గార్డెన్ లో దినేష్ కులాచారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ హాజరై మాట్లాడారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడి పడి పనిచేసి ఇందూర్ గడ్డ పై కాషాయ జెండా ఎగురావేసిన కార్యకర్తలకే ఈ విజయం దక్కుతుందని అన్నారు. ఎమ్మెల్యే గెలిచినం, ఎంపీ గెలిచినం రేపు జరగబోయే స్థానిక ఎన్నికలు కూడా గేలిస్తేనే బిజెపి పాలన అంటే ఎలా ఉంటుందో ప్రజలకు తెలుస్తుందని అన్నారు. గ్రామాలల్లో వార్డ్ మెంబెర్ దగ్గర నుండి, నగరంలో మేయర్ వరకు అన్నిటిని మనమే గెలవాలని, ప్రతి కార్యకర్త మరో యుద్ధానికి సంసిద్ధులు కావాలని పిలుపునిచ్చారు. నాయకులుగా ప్రజాలకు సేవ చేసే అవకాశాన్ని బిజెపి కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ ఒకటి అనే దుష్ప్రచారం చేసి ఆరు గ్యారంటీలతో, ఐదు డిక్లరేషన్లతో 420 హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందని, రేవంత్ 100 రోజుల్లో ఇచ్చిన గ్యారంటీలు అమలు చేస్తానని 200





రోజులు గడుస్తున్న హామీలు నెరవేర్చకుండా దేవుళ్ళ పైన ఓట్లు పెడుతు కాలయాపన చేస్తున్నాడని అన్నారు. వరంగల్ భద్రకాళి అమ్మవారి సాక్షిగా రైతు డిక్లరేషన్ ప్రకటించి రైతన్నలను నిండా ముంచింది కాంగ్రెస్ రేవంత్ సర్కార్ అన్నారు. రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి 15000, రైతు కూలీలకు 12000, వరి పంటకు బోనస్ 500 రైతులకు 24 గంటల ఉచిత కరెంటు, సోనియా జన్మదినం డిసెంబర్ 9న 2లక్షల రుణమాఫీ అని చెప్పి ఇప్పటివరకు ఒక్కటంటే ఒక్కటి అమలు చేయలేదన్నారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో కొత్త స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న బిసి రిజర్వేషన్ 23 నుండి 42 శాతానికి పెంచుతామన్నా హామీని అమలు చేయాలనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు అయితుందని ఇప్పటివరకు నియోజకవర్గాలకి ఇచ్చింది ఏమీ లేదని అన్నారు.

తెలంగాణలో ఎనిమిది మంది ఎమ్మెల్యేలం ఉన్నాం ఖచ్చితంగా అసెంబ్లీలో ప్రశ్నిస్తాం, నిలదిస్తాం కొట్లాడుతాం అన్నారు. గ్యారంటీలు, డిక్లరేషన్లు హామీలు అమలు చేసే వరకు విడిచిపెట్టాం అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మచ్చలేకుండా "విధులు" అభినందనీయం.

**- పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగెనవార్.**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జులై 15:**

ఉద్యోగంలో మచ్చలేకుండా విధులు నిర్వహించడం అభినందనీయం అని పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ అన్నారు. హెూమ్ గార్డు వి. గంగారెడ్డి పదవి విరమణ వీడ్కోలు కార్యక్రమం సోమవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ పదవి విరమణ పొందిన గంగారెడ్డి ని శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ మాట్లాడుతూ, ఎలాంటిరిమార్కు లేకుండా పదవివిరమణ చేయడం ఎంతో గోప్ప విషయమని అన్నారు. గంగారెడ్డి డిపార్టుమెంటుకు చేసిన సేవలు ఎంతోఘననీయమని. పేర్కొన్నారు. పదవి విరమణ అనంతరము ఎలాంటి అవసరం వచ్చిన ఎల్లవేళల సహయపడుతామని హామీ ఇచ్చారు. గంగారెడ్డి, కుటుంభ సభ్యులు అయురారోగ్యాలతో ఉండాలని, పిల్లల భవిష్యత్తుభాగుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు డి.సి.పి ( ఎ.ఆర్ ) శంకర్ నాయక్, రిజర్వు ఇన్స్పెక్టర్ ( హెూమ్ గార్డు విభాగం హెచ్. సతీష్, హెడ్ కానిస్టేబుల్ గోపాల్, గంగారెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బీజేపీ కార్యకర్తలకు అండగా ఎంపీ అర్వింద్.

**- కార్యకర్తల కుటుంబాలకు రూ" 8.80 లక్షల చెక్కుల పంపిణీ.**





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జులై 15:**

భారతీయ జనతా పార్టీ కార్యకర్తల కుటుంబాలకు మరోసారి నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు అర్వింద్ ధర్మపురి అండగా నిలిచారు. నగరంలోని ఎంపి కార్యాలయంలో సోమవారం అర్వింద్ ధర్మపురి కార్పస్ ఫండ్ - బూత్ స్థాయి కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా పార్లమెంట్ పరిధిలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన 21 బూత్ స్థాయి కార్యకర్తల కుటుంబాలకు 8.80 లక్షల చెక్కులను అందజేశారు. 2021 సెప్టెంబర్ 17న నిర్మల్ సభలో కేంద్ర మంత్రివర్యులు అమిత్ షా చేతుల మీదుగా అర్వింద్ ధర్మపురి కార్పస్ ఫండ్ - బూత్ స్థాయి కార్యకర్తల సంక్షేమ నిధిని ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీని



ద్వారా ఎంపీ అర్వింద్ ఇప్పటి వరకు 186 మంది బూత్ స్థాయి కార్యకర్తల కుటుంబాలకు సహాయం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ, కార్యకర్తలకు అన్నివేళలా అండగా ఉంటానన్నారు. కార్యకర్తలను ఆపదలో



ఆదుకోవడం అదృష్టంగా భావిస్తానన్నారు. ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు, నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా పలు బాధిత కుటుంబాల కుటుంబ సభ్యులు ఎంపీకి ధన్యవాదాలు తెలిపారు.

# దండి వెంకట్ పై మోపిన కేసును ఎత్తి వేయాలి.



**బిఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మన్ నల్ల సూర్య ప్రకాష్ డిమాండ్.**

**రాష్ట్ర అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ కు వినతి.**

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, జులై 15: "**

నిజామాబాద్ జిల్లాలో బహుజన, వామపక్ష, ప్రజా ఉద్యమాలకు కీలకమైన నాయకుడిగా ఉన్న బి.ఎల్.ఎఫ్. రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ పై మోపిన కుట్రపూరితమైన, అనైతికమైన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని బిఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మన్ నల్ల సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. నాన్బెయిలబుల్ సెక్షన్ ద్వారా నిర్బంధించడానికి స్థానిక పోలీసు వర్గాలు ప్రయత్నం చేయడాన్ని రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని ఆయన కోరారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ ను బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బి.ఎల్.ఎఫ్.) ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రతినిధి బృందం వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో సూర్య ప్రకాష్ మాట్లాడారు. "కొంతమంది కార్మిక వ్యతిరేక శక్తుల ప్రోత్బలంతో, నిజామాబాద్ స్థానిక పోలీసులు ప్రజా నాయకుడు అని కూడా చూడకుండా, ప్రజా ఉద్యమాలను గండి కొట్టేందుకు ముఖ్యమైన బహుజన వామపక్ష నాయకుడిగా ఉన్న బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ పై అక్రమ కేసును మోపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారుల చొరవతో స్థానికంగా పెట్టిన కేసులను తక్షణం ఉపసంహరించాలని, లేకపోతే ఇట్టి అక్రమ కేసుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని" అన్నారు. రాష్ట్ర డిజిపి మహేష్ భగవత్ ఇట్టి సమస్యను పరిశీలిస్తామని, సమగ్ర పరిశీలన చేస్తామని అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు గాదగోని రవి, రాష్ట్ర కన్వీనర్లు నూనె వెంకట్ స్వామి, కే పర్వతాలు, దండి వెంకట్, మారోజు సునీల్, సబ్బని లత పాల్గొన్నారు.

# భారతీయుడు-2 నెగెటివ్ టాక్ ప్రారంభ వసూళ్లు వీక్



దాదాపు 28 సంవత్సరాల క్రితం శంకర్ దర్శకత్వంలో రూపొందిన భారతీయుడు సినిమా ఎంతటి ఘన విజయం సాధించందో తెలిసిన విషయమే. దానికి సీక్వెల్ భారతీయుడు 2.ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. అయితే ఫస్ట్ షో నుంచే ఈ సినిమాకు నెగిటివ్ టాక్ రావడం మొదటి భాగమైన భారతీయుడికి ధీటుగా లేకపోవడం వలన మూవీపై చాలా దెబ్బ పడింది. ఇక ఎన్నో అంచనాలతో చిత్రాన్ని వీక్షించడానికి వచ్చిన ప్రేక్షకులకు అడుగడుగునా అసంతృప్తికి గురిచేసిందని సినిమా రివ్యూలు చెబుతున్నాయి. దీనికి తోడు టిక్కెట్ల రేట్లు పెంచడం ఈ చిత్రానికి మైనస్ అనే చెప్పుకోవాలి.తెలంగాణలో టిక్కెట్ల రేట్లు పెంచుకోవడానికి తెలంగాణ ప్రభుత్వంను అనుమతి కోరగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే మల్టిప్లె క్సలలో 75 నుంచి 150 వరకు టిక్కెట్ల రేటు పెంచడానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ చిత్రానికి ఉన్న వీక్ టాక్ తో ప్రారంభ వసూళ్లు కూడా లేకపోవడం గమనార్హం .ఇటీవల విడుదలై బ్లాక్ బస్టర్ గా నిలిచిన కల్కి 2898 ఏడీ సినిమాకు కూడా టిక్కెట్ల రేట్ల పెంపుదల కాస్త మైనస్ గానే మారిందని అందరి అభిప్రాయం. భారతీయుడు-2 కూడా టిక్కెట్ల రేట్లు పెంచడం, సినిమా ప్రేక్షకులను నిరాశపరిచిన విధానం వీటి ప్రభావం కలెక్షన్స్ పై పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ పరిస్థితిలో భారతీయుడు -2 కలెక్షన్స్ కష్టమే అంటున్నారు.

# వచ్చే నెలలోనే కిరణ్ అబ్బవరం, నటి రహస్య గోరక్ వివాహం



నటుడు కిరణ్ అబ్బవరం, నటి రహస్య గోరక్ వివాహానికి ముహూర్తం ఖరారైంది. వచ్చే నెలలో వీరి పెళ్లి జరగనుంది. తనకు కాబోయే భర్త కిరణ్ అబ్బవరం పుట్టినరోజును పురస్కరించుకుని రహస్య ఈ విషయాన్ని బయటపెట్టారు. ఆయనకు బర్త్‌డే విషెస్ చెబుతూ ఇన్‌స్టాలో ఆసక్తికర పోస్ట్ పెట్టారు. 'రాజావారు రాణిగారు' సమయం నుంచి నిశ్చితార్థమైన నాటివరకూ వీరిద్దరూ కలిసి దిగిన పలు ఫొటోలు, వీడియోలతో స్పెషల్ వీడియో క్రియేట్ చేసి దాన్ని అభిమానులతో పంచుకున్నారు. 'హ్యాపీ బర్త్‌డే కిరణ్ అబ్బవరం. మరో 38 రోజుల్లో నిన్ను.. మై హస్బెండ్ అనేందుకు ఆశగా ఎదురుచూస్తున్నా' అని ఆమె క్యాప్షన్ జత చేశారు. 2019లో విడుదలైన 'రాజావారు రాణిగారు'తోనే కిరణ్ తెరంగేట్రం చేశారు. ఇందులో రహస్య కథానాయికగా నటించారు. రొమాంటిక్ డ్రామాగా రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను అలరించింది. ఆ మూవీ షూటింగ్‌లోనే ఇద్దరి మధ్య ఏర్పడిన స్నేహం.. ప్రేమగా మారినట్లు తెలుస్తోంది. మార్చిలో వీరి నిశ్చితార్థం జరిగింది. కిరణ్ ప్రస్తుతం 'క' కోసం వర్క్ చేస్తున్నారు. పాన్ ఇండియా ఫిల్మ్‌గా ఇది విడుదల కానుంది. సుజీత్, సందీప్ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని 'క' టీజర్ విడుదల చేశారు.



# నాలుగేళ్ల నాటి డ్యాన్స్ కట్‌పై ట్రోల్సా ?

హైదరాబాద్: తన డ్యాన్స్‌ను ట్రోల్ చేస్తూ సోషల్‌మీడియా వేదికగా ఓ నెటిజన్ పెట్టిన పోస్ట్‌పై నటి అనసూయ స్పందించారు. పారదర్శక, గౌరవప్రదమైన విమర్శలను తాను ఆహ్వానిస్తానని చెప్పారు. 'నా మానసిక ప్రశాంతతను దృష్టిలో ఉంచుకొని కొన్ని విషయాలపై స్పందించకూడదని నిర్ణయించుకున్నా. మహానటి సావిత్రమ్మకు నివాళిగా దాదాపు నాలుగేళ్లక్రితం ఓ ఈవెంట్‌లో నేనిచ్చిన ప్రదర్శనలోని కొన్ని డ్యాన్స్ మూమెంట్స్‌ను ట్రోల్ చేయడం.. వాటికి ఇలా అవమానకర రీతిలో విమర్శలు చేయడం బాధాకరం. ఇక్కడ నా గురించి చెప్పట్లేదు.. నివాళులకు సంబంధించిన విషయాల్లో ఇలా చేయడం ఆ గొప్ప వ్యక్తులను అవమానపర్చినట్లే..! మర్యాదపూర్వకమైన విమర్శలను నేను ఎప్పుడూ స్వాగతిస్తా. ఆ కార్యక్రమంలో నా మొత్తం ప్రదర్శన చూసిన తర్వాత మీరు ఒక నిర్ణయానికి రండి' అని ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ చేశారు. అనసూయ ప్రస్తుతం వరుస సినిమాల్లో యాక్ట్ చేస్తున్నారు. 'పుష్ప 2'తోపాటు 'ఫ్లాష్‌బ్యాక్', 'వోల్ఫ్' వంటి తమిళ చిత్రాల్లో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# వైవిధ్యంగా తంగలాన్ మూవీ చిత్రీకరణ




కథానాయకుడు చియాన్ విక్రమ్ ఎంపిక చేసుకునే పాత్రలు చాలా వైవిధ్యంగా ఉంటాయి. ప్రస్తుతం తంగలాన్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. కాలా, కబాలి వంటి సినిమాలు రూపొందించిన దర్శకుడు పా.రంజిత్ దర్శకత్వంలో విక్రమ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం తంగలాన్. ఈ చిత్రాన్ని పా.రంజిత్ తనదైన శైలిలో అందరూ అబ్బుర పడేలా చిత్రీకరించారని యూనిట్ వర్గాలు చెప్పారు. ఇక విడుదలైన ఈ థియేట్రికల్ ట్రైలర్ చూస్తుంటే తప్పకుండా ఈ చిత్రాన్ని థియేటర్‌లో ఎక్స్‌పీరియన్స్ చేయాల్సిన సినిమాలా అనిపిస్తుందని అంటున్నారు విక్రమ్ అభిమానులు. తంగలాన్ బంగారు నిధుల నేపథ్యంలో యథార్థ సంఘటనలతో తీసిన చిత్రంలా కనిపిస్తుంది. విజువల్స్ ఆకట్టుకునే విధంగా వున్నాయి. మేకింగ్‌లో రిచ్‌నెస్, ప్రొడక్షన్ క్వాలిటీస్ కనిపిస్తున్నాయి. విక్రమ్ ఈ చిత్రంలో అటవి జాతికి చెందిన వీరుడిలాగా? ఇప్పటి వరకు కెరీర్‌లో పోషించనటువంటి వైవిధ్యమైన పాత్రలో కనిపిస్తున్నారు.



# పివిఆర్ థియేటర్లో వర్షపు జల్లు

## భార వర్షంతో కల్కి మూవీ రద్దు

ప్రభాస్ హీరోగా నటించిన 'కల్కి 2898 ఏడీ' వసూళ్ల వర్షం కురిపించడమే కాదు థియేటర్‌లోను వర్షం కురిపించింది. పంజాగుట్టలోని పీవీఆర్ థియేటర్‌లో సినిమా చూద్దామని వెళ్లిన ఫ్యాన్స్, ప్రేక్షకులకు చుక్కలు కనిపించాయి. బాక్సాఫీస్ బరిలో ఈ సినిమాకు వసూళ్ల వర్షం కురవడం కాదు... థియేటర్ లోపల నిజంగా వర్షం కురిసింది. దాంతో సినిమా చూస్తున్న ప్రేక్షకులు షాకయ్యారు. ఏం జరుగుతుందో తెలియక ఆందోళనకు గురి అయ్యారు. ఆ తర్వాత షో క్యాన్సిల్ కావడంతో తీరిగ్గా బయట పడ్డారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో కుండపోత వర్షం కురిసింది. ఆ వర్షం ప్రభావం 'కల్కి 2898 ఏడీ' సినిమాపై పడింది. నగరం నడిబొడ్డున ఉన్న పీవీఆర్ పంజాగుట్టకు వెళ్లిన ఆడియన్స్ ప్రభాస్ సినిమా పూర్తిగా చూడకుండానే వెనుదిరిగారు.




నగరంలో కురిసిన భారీ వర్షాలకు పీవీఆర్ పంజాగుట్ట థియేటర్ పైకప్పు డ్యామేజ్ అయ్యింది. దాంతో థియేటర్ లోపలకు వర్షపు నీరు కురిసింది. తమ మీద నీరు పడటంతో సినిమా చూస్తున్న ప్రేక్షకులకు ఏమీ అర్థం కాలేదు. చివరకు, ఆ షో క్యాన్సిల్ చేసి మధ్యలోనే ప్రేక్షకుల్ని బయటకు పంపించారు. ఇదంతా వీడియో తీసి ఓ ప్రేక్షకుడు సోషల్ మీడియాలో షేర్ చేయగా వైరల్ అయింది. దీనిపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షం నీటికి షార్ట్ సర్క్యూట్ అయితే పరిస్థితి ఏంటి ఏంటి? అని పీవీఆర్ సిబ్బందిని నిలదీస్తున్నారు. పూర్ మెయింటెనెన్స్ అని మరో నెటిజన ట్వీట్ చేశాడు. ఈ వీడియోలు చూసిన జనాలు షాక్‌కి గురయ్యారు.




# సామ్.. ఈ లుక్కుతో కిల్ చేసేలా..

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత సిల్వర్ స్క్రీన్ పై కనపడి చాలా నెలలు అవుతోంది. దాదాపు రెండేళ్ల క్రితం ఖుషీ మూవీతో పలకరించిన సామ్.. ఇప్పటివరకు మళ్లీ కొత్త సినిమాతో సందడి చేయలేదు. దీంతో ఆమెను వెండితెరపై చూసేందుకు ఫ్యాన్స్ తోపాటు సినీ ప్రియులు ఎంతో వెయిట్ చేస్తున్నారు. ఆ మధ్య తన బర్త్ డే సందర్భంగా మా ఇంటి బంగారం టైటిల్ తో తన సొంత బ్యానర్ పై సినిమాను అనౌన్స్ చేసింది సమంత.ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై ఆ చిత్రాన్ని సమంత స్వయంగా నిర్మిస్తోంది. కానీ ఆ ప్రాజెక్ట్ కు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదు. పైగా కొన్ని నెలలకు సోషల్ మీడియాలో వివిధ థెరపీల కోసం పోస్టులు పెడుతోంది సామ్. హెల్త్ టిప్స్ కూడా ఇస్తోంది. రీసెంట్ గా సద్గురు ఆశ్రమానికి వెళ్లి ఆధ్యాత్మిక చింతనలో కనిపించింది. దీంతో ఆమె ఇంకా సినిమాలు చేయడం స్టార్ట్ చేయలేదని వార్తలు వచ్చాయి.అయితే ఇప్పటికే ఆమె పూర్తి చేసిన సిటాడెల్ హనీ బనీ వెబ్ సిరీస్ త్వరలోనే అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. మరో రెండు వెబ్ సిరీసులతో పాటు కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్ వస్తోంది. మలయాళం స్టార్ హీరో మమ్ముట్టి సినిమాలో సామ్ హీరోయిన్ గా ఎంపికైందని వార్తలు వచ్చాయి. కానీ ఆ మూవీ లాంచింగ్ ఈవెంట్ లో ఆమె కనిపించలేదు. ఎలాంటి పోస్ట్ కూడా పెట్టలేదు.ప్రస్తుతం బాలీవుడ్ నటులతో పలు యాడ్స్ చేస్తోంది సామ్. ఇప్పుడు తాజాగా %జూరాజు% మ్యాగ్ జైన్ కవర్ పేజీపై దర్శనమిచ్చింది. బ్లాక్ కలర్ ఫుల్ డిజైనర్ డ్రెస్ లో మెరిసింది సామ్. అందులో అమ్మడు అదిరిపోయింది. హెయిర్ లీవ్ చేసి తన గ్లోయింగ్ స్కిన్ తో ఆకట్టుకుంటోంది. తన చూపుతో అందరినీ మాయ చేస్తోంది. తన ఎక్స్ప్రెషన్ తో మత్తెక్కిస్తోంది. ఎద అందాలతో కవ్విస్తోంది. అందుకు సంబంధించిన పిక్ ఇప్పుడు వైరల్ గా మారింది. సమంత స్పెషల్ ఇంటర్వ్యూ తమ మ్యాగ్ జైన్ లో ఉన్నట్లు సంస్థ పోస్ట్ పెట్టింది. ఉదయ్ పూర్ రిసార్ట్ లో పిక్ దిగినట్లు తెలిపింది. 50 మిలియన్ల మంది ఫాలోవర్స్.. ఆమె గురించి తెలుసుకోవాలని తహతహలాడుతున్నట్లు చెప్పింది. మొత్తానికి డీసెంట్ గ్లామర్ తో సామ్.. పిక్ లో అదిరిపోయిందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. పిక్ సూపర్ అని అంటున్నారు. మరి మళ్లీ సామ్.. సిల్వర్ స్క్రీన్ పై ఎప్పుడు కనిపిస్తుందో చూడాలి.